క్లుప్తంగా

బైక్ చోరీపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి అమ్మవారి ఆలయం వద్ద పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. ఈ ఘటనపై బుధవారం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. సంగం గ్రామానికి చెందిన ఈర్ల శివశంకర్ అనే యువకుడు అమ్మవారి దర్శన నిమిత్తం ఈనెల 5వ తేదీన తన పల్సర్ బైక్‌పై వచ్చి ఆలయం వెనుక భాగాన బైక్‌ను పార్కు చేసి అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. దర్శనం ముగించుకుని తిరిగి వచ్చేసరికి బైక్ లేకపోవడంతో గాలింపు చేపట్టాడు. అయితే బైక్ ఆచూకీ తెలియకపోవడంతో తమకు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడి గ్రామానికి చెందిన వివాహిత కూని స్వప్న అదృశ్యంపై ఆమె భర్త ప్రవీణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల రెండో తేదీన ప్రవీణ్ పనినిమిత్తం బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకోగా భార్య స్వప్న లేకపోవడంతో గ్రామంలో విచారించాడు. అంతేకుండా బంధువుల గ్రామాలకు వెళ్లి గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య అదృశ్యంపై గ్రామానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ప్రమేయం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

పొదలకూరు : పట్టణంలోని గీతామందిరంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతాయని మందిర నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి మేలుకొలుపు, 7.30 గంటలకు గీతాపారాయణం, 8 గంటలకు గ్రామ సంకీర్తన, 10 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 11.20 గంటలకు బంగారుపూలతో అష్టోత్తరం, మధ్యాహ్నం 12 గంటలకు మంత్రపుష్పం, 12.15 గంటలకు హారతి, తీర్థప్రసాదాల పంపిణీ జరుగుతుందని తెలియజేశారు. 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు స్వామికి ఊయలసేవ ఉంటుందన్నారు.

బస్‌షెల్టర్లో వ్యక్తి మృతి



పొదలకూరు : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ బస్‌షెల్టర్లో ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. కలువాయి మండలం వెదనపర్తి గ్రామానికి చెందిన కొట్టా తిరుపాల్(40) బస్టాండ్లోని బస్‌షెల్టర్లో పడుకున్నాడు. అక్కడే మరణించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అతిగా మద్యం సేవించి గొంతెండి మృతి చెందాడా? లేక మరేదైనా కారణమా అనే దానిపై ఎస్సై కరిముల్లా విచారణ చేపట్టారు. తిరుపాల్ బంధువులకు సమాచారం అందించి వారు వచ్చిన తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తామని ఎస్సై స్పష్టం చేశారు.

సింహపురికి కృష్ణాష్టమి శోభ

నగరంలోని వివిధ ఆలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలను ప్రతిష్టించి శాస్త్రోక్తంగా అంకురార్పణ, పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాద వితరణ జరిగింది. ఇళ్లల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను శ్రీకృష్ణుడు, గోపికలుగా ముస్తాబుచేసి మురిసిపోయారు.



శివకేశవులు దేవస్థానంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

నెల్లూరు(బృందావనం) : ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు శాఖ అధ్యక్షుడు సురమౌళి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్‌రోడ్డు సరస్వతీనగర్ స్రవంతి స్కూల్ దగ్గర ఆరు రోజుల పాటు నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలు విగ్రహ ప్రతిష్టతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు బుధవారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పఠనం జరిపించారు. భగవద్గీత శ్లోకాల రాత పోటీలు గురువారం నిర్వహించనున్నట్లు సురమౌళి వివరించారు. కార్యక్రమాలను పెంచల ప్రసాద్, సునీల్, పద్మావతి, మనోజ, కేవీ రత్నం, లక్ష్మయ్య పర్యవేక్షించారు.

➡ సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణ యోగ మందిరంలో మూలవర్లు, ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం జరిగాయి. సాయంత్రం కోలాటం, పల్లకిసేవ, మహా హారతులు విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ఎస్.గిరికుమార్‌యాదవ్, నిర్మల దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఎస్‌జీఎస్‌కేజీబీఎస్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సర్వేపల్లి అజయకుమార్ పర్యవేక్షించారు.

➡ వేదాయపాళెంలోని శ్రీకృష్ణ మందిరంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం గోపూజ, శ్రీకృష్ణస్వామికి చందనాలంకారం, పంచామృతాభిషేకాలను అర్చకుడు బి.శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. ఉభయకర్తలుగా మాణికల లక్ష్మీనరసింహయాదవ్- పద్మ, బీవీ రాఘవేంద్ర- శైలజ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం కమిటీ వ్యవస్థాపకుడు సీహెచ్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బరామరాజు, వేణుగోపాల్ పర్యవేక్షించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మందిర కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా- గీతాంజలి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర కమిటీ పర్యవేక్షించింది.

బాలాజీనగర్ పిండిమిల్లు సెంటర్‌లో..

నగరంలోని బాలాజీనగర్ పిండిమిల్లు సెంటర్‌లో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు స్థానిక యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కొట్టే వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పిండిమిల్లు సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సినీనటుడు పృథ్వీరాజ్ విగ్రహ ప్రతిష్ట చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా ఈ వేడుకలను నిర్విరామంగా నిర్వహిస్తున్నామన్నారు. 7వ తేదీ ఉట్టి మహోత్సవం, 8వ తేదీ అన్నదాన కార్యక్రమం, 9వ తేదీ వస్త్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.



ఎన్టీఆర్ నగర్‌లో..

శివకేశవులు దేవస్థానంలో..

క్రాంతినగర్‌లోని శివకేశవులు దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమం జరిపించారు. ఈ కార్యక్రమానికి మునిరాజ్, మునిలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం ఉట్టి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శిగుంట విజయచంద్ర, యశోద దంపతులు దాతలుగా వ్యవహరించారు. 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ రావు శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య, ప్రసాద్‌రెడ్డి, గొట్టం మల్లికార్జున, యనమల గోవింద్, నర్సయ్య, బలుసు స్వామి, శేషం మల్లికార్జున, సురేంద్ర, సాయి, రాకేష్, బబ్లూ, వెంకటేష్ పాల్గొన్నారు.



శ్రీకృష్ణ యోగ మందిరంలో



శ్రీకృష్ణ మందిరంలో గోపూజ



బాలాజీనగర్ పిండిమిల్లు సెంటర్‌లో..

సత్కారం



నెల్లూరు(బృందావనం) : కృష్ణాష్టమి సందర్భంగా పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో సృజన సాహితి, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో భక్తిగీతాలాపన, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు బుధవారం సత్కారాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత జి.నాగేశ్వరరావుయాదవ్, గాయకుడు ఎం.ఆదిశేషయ్య, విశ్రాంత హెడ్‌నర్స్ కోవెల కల్పన, విశ్రాంత ప్రభుత్వాధికారి ఓరుగంటి సత్యనారాయణశర్మ, కోలాటం గురువు ఆర్.వంశీకృష్ణారెడ్డిలను సత్కరించారు. వైద్యులు మాదాల వెంకటేశ్వరరావు, మారం సుధాకర్, ఎం.కాశయ్య, ఎస్.రాజశేఖర్, బి.మనోహర్, మాజీ కార్పొరేటర్ పిట్టి సత్యనాగేశ్వరావు, బుల్లితెర నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు పాల్గొని, ప్రసంగించారు.

చీరల పంపిణీ

నెల్లూరు(బృందావనం) : శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ట్రంకురోడ్డు గాంధీబొమ్మ వద్ద ఉన్న స్వతంత్ర పార్కులో కేతా సుబ్బారావు ప్రజావేదిక ఆధ్వర్యంలో పేద మహిళలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ చేతులమీదుగా అందించారు.

రేపటి నుంచి కృతజ్ఞతార్పణల పండగ

నెల్లూరు (బందావనం) : నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డౌనీ హాలు వార్షిక కృతజ్ఞతార్పణల పండగ ఈనెల 8, 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చర్చి సెక్రటరీ గుర్రం అరుణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్తుతి కూడిక ప్రత్యేక ఆరాధన, 9న ఉదయం 8 నుంచి సంతోష సహవాసం, ఆటల పోటీలు, క్విజ్ పోటీలు జరుగుతాయని, 10న ఉదయం 9.30 గంటలకు కృతజ్ఞతార్పణల ఆరాధన ఉంటుందని తెలియజేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు నగర పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. పసుపు పచ్చరంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్టు, గ్రేరంగు జీన్స్ ప్యాంట్ ధరించి సుమారు 30 నుంచి 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి వేదాయపాళెం–నెల్లూరు రైల్వేస్టేషన్‌ల మధ్య కావలి వైపు వెళ్లే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుడిచేతిపై యువన్ అని ఇంగ్లిష్‌లో, ఎడమచేతి మీద కె.ఎం.బి, తల్లీబిడ్డ బొమ్మ పచ్చబొట్లు ఉన్నాయి. మృతుని వివరాలు తెలియరాలేదు. దీంతో మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్‌ఫారమ్‌పై అనారోగ్యంతో..



వృద్ధుడి మృతదేహం

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫారమ్‌పై సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు బుధవారం అనారోగ్యంతో మరణించాడు. మృతుడు తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, తెలుపు-పచ్చ రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుల వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

నేతన్నకు ఆర్థిక సాయం



నెల్లూరు(మినీబైపాస్) : నగరంలోని గాంధీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కవర్తపు ఆనందరావు కిడ్నీ సమస్య వల్ల బాధపడుతుండడంతో పలువురు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మీనారాయణ, సుధాకర్, భాస్కర్, శేషు, పరంధామయ్య కలిసి రూ.5000లను అందించారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీకి చెందిన నందం అశ్వద్దామ, బాలాజీ, రామనాథం రాజశేఖర్, మధుబాబు, లక్ష్మీనారాయణ, సురేష్, గోపాల్, వేణుగోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో మతి స్థిమితంలేని వ్యక్తి గత రెండు రోజుల నుంచి హల్‌చల్ చేస్తున్నాడు. స్థానికులు, ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాడు. కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు సమీపంలోని దుకాణాల వద్ద మంగళవారం సాయంత్రం మతిస్థిమితం లేని వ్యక్తి పెద్దగా కేకలు వేస్తూ, ప్రయాణికులను భయపెట్టాడు. దర్గాకు వచ్చిన ఓ భక్తుడి సెల్‌ఫోన్‌ను లాక్కోవడంతో స్థానికులు చుట్టుముట్టి సెల్‌ఫోన్‌ను తీసుకున్నారు. అనంతరం అతన్ని చెరువు కట్టపైకి తీసుకెళ్లి వదిలారు. అయితే బుధవారం సాయంత్రం కూడా ఆ వ్యక్తి దుకాణాల వద్దకు వచ్చి హల్‌చల్ చేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

నగరాభివృద్ధిలో రాజీపడేది లేదు



డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్

• సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు నగరాభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని 8వ డివిజన్ ఆర్‌ఎస్సార్ స్కూల్ సమీపంలోని అరుంధతీయపాళెం వద్ద రూ.1.70 కోట్లతో నిర్మిస్తున్న డ్రెయిన్ పనులకు ఎమ్మెల్యే అనిల్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్సార్ స్కూల్ నుంచి అరుంధతీయపాళెం మీదుగా హిమాలయ స్కూల్ వెనుక వైపు, అక్కడి నుంచి కామాటి హరిజనవాడ డ్రెయిన్, నజీరుతోట నుంచి చిన్నబాలయ్య స్కూల్ వరకు ఉన్న కాలువకు రూ.1.70 కోట్లతో డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అక్కడి నుంచి ఎక్స్‌టెన్షన్‌కు మరో రూ.కోటితో టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. మొత్తం రూ.2.70 కోట్లతో స్థానిక డివిజన్‌తో పాటు తొమ్మిదో డివిజన్‌లో కొంత భాగం వరకు డ్రెయిన్ పనులను ప్రారంభించినట్లు తెలియజేశారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేస్తామన్నారు. మొదటి ప్రాధాన్యతగా డ్రెయిన్ పనులు చేపడుతున్నామని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని స్పష్టం చేశారు. నూటికి నూరు శాతం నగరాభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన నిజాముద్దీన్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో నిజాముద్దీన్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్ మందిరంలో కోలాహలం



మందిరంలో భక్తులు



నెల్లూరు నగరంలోని ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో విచ్చేశారు. దీంతో ఇస్కాన్ మందిరంలో కోలాహలం నెలకొంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కృష్ణుడి వేషధారణలో చిన్నారి



స్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు



చిన్నా అదిగో కన్నయ్య..

నేడు రంగడి సన్నిధిలో కృష్ణ జయంతి

నెల్లూరు(బృందావనం) : శ్రీకృష్ణ జయంతి సందర్భంగా నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు రంగనాథస్వామికి, శ్రీకృష్ణస్వామికి తిరుమంజనం జరుగుతుందని దేవస్థానం ఈఓ డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ.శివకుమార్‌ఆచారి బుధవారం తెలిపారు. అనంతరం శ్రీకృష్ణ పురాణ పఠనం, సేవాకాలం, గోపురోత్సవం జరుగుతాయన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు ఉట్టి మహోత్సవం, పేట ఉత్సవం జరుగుతాయని వివరించారు.

ఇస్కాన్ మందిరంలో..

మినీబైపాస్‌రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో గురువారం ఉదయం 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు కృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు, భక్తి గీతాలాపన, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగర పరిధిలో గురువారం నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర పిలుపునిచ్చారు. నగరంలోని బృందావనంలో ఉన్న ఆమె కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్ర నిర్వహించి ఏడాది పూర్తయిన సందర్భంగా నగరంలోని కనకమహల్ సెంటర్‌లో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం నుంచి జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు యాత్ర జరుగుతుందన్నారు.